హెచ్‌సీయూ పూర్వ విద్యార్థులకు ఎక్సలెన్స్ అవార్డులు


ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా అవార్డును అందుకున్న డా.మార్కండేయ, డా.విబిరెడ్డి

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థులు మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. హెచ్‌సీయూ పూర్వ విద్యార్థి ఏటీజీసీ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ డాక్టర్ మార్కండేయ గోరంట్ల, ఏటీజీసీ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ విబిరెడ్డి ఇద్దరు ఈ అవార్డుకు ఎంపిక య్యారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) ద్వారా సైన్స్, ఇంజనీరింగ్‌లో ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు. వీరిద్దరు నిజాం కళాశాల, హెచ్‌సీయూ పూర్వ విద్యార్థులు. హెచ్‌సీయూ నుంచి ప్లాంట్ సైన్స్‌లో పీహెచ్‌డీ చేసిన డాక్టర్ గోరంట్ల మార్కండేయ, వ్యవసాయ బయోటెక్నాలజీలో డాక్టర్ విబిరెడ్డి అద్భుతమైన పనికి గుర్తింపుగా ఈ అవార్డును పొందారు. ఏటీజీసీ బయోటెక్‌లో డాక్టర్ గోరంట్ల, డాక్టర్ విబిరెడ్డి ఇద్దరు ప్రొఫెసర్ అర్జుల ఆర్ రెడ్డితో కలిసి పురుగు మందులు లేని ప్రపంచ దృక్పథాన్ని ప్రతిబింబించారు. వారిద్దరిని హెచ్‌సీయూ ప్రొఫెసర్లు, అధికారులు అభినందించారు.

వారాహి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



రాయదుర్గం: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో వారాహి నవరాత్రి ఉత్సవాలు ఆరంభమయ్యాయి. మొదటి రోజు శనివారం ఆలయంలో అన్నపూర్ణా దేవికి అర్చనలు, అభిషేకం, అష్టోత్తర పూజ చేశారు. వారాహి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని అన్నపూర్ణాదేవికి రుద్రాక్షలతో ప్రత్యేకంగా అలంకారం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ ట్రస్టీ వాసిరెడ్డి పార్వతి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులు

పటాన్‌చెరు: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ లాలునాయక్ అన్నారు. శనివారం మండలంలోని ముత్తంగి గ్రామ పరిధిలోని హరి హోటల్ సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న గుంతలకు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా లాలూనాయక్ మాట్లాడుతూ... వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రాంగ్ రూట్‌లో వాహనాలు నడపవద్దన్నారు.





జగద్గిరిగుట్ట – కూకట్‌పల్లి దారిలోని పీజేఆర్ ఫంక్షన్ హాలు సమీపంలో..



రిక్షాపుల్లర్స్ కాలనీలోని పీజేఆర్ విగ్రహం వద్ద లీకవుతున్న మంచినీరు

కలుషిత నీటి సరఫరా

డయేరియా, జ్వరాలతో అల్లాడుతున్న ప్రజలు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ, వివేకానందనగర్, కూకట్‌పల్లి డివిజన్‌ల పరిధిలో తాగునీటి పైపులైన్ లీకేజీలతో మంచినీటిలో మురుగునీరు కలిసి కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని ఆయా కాలనీలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడపాదడపా వర్షాలు కురుస్తుండడం.. వాతావరణంలో మార్పు రావడంతో జ్వరాల బారిన పడుతున్నారు. దీనికి తోడు కలుషిత నీటితో డయేరియా వస్తోందని స్థానికులు వాపోతున్నారు. అధికారుల నిర్లక్ష్యం, ప్రజా ప్రతినిధుల అలసత్వం కారణంగా ప్రతి కాలనీలో మంచినీటి పైపులైన్‌లు, వాల్వ్‌లు లీకేజీలతో కలుషిత నీరు సరఫరా అవటంతో నిత్యావసరాలకు కూడా నీరు వాడుకోలేని పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు. మురుగునీరు ఏరులై పారుతుండటంతో వాటర్‌వర్క్స్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేస్తే తూతూమంత్రంగా మరమ్మతులు చేసిపోతున్నారని సమస్య పునరావృతమవుతోందని స్థానికులు మండిపడుతున్నారు. సరఫరా అవుతున్న నీటిలో చెత్తా, చెదారం వస్తోందని, దుర్వాసన వెలువడుతుందని తెలిపారు. బోర్లు లేని వారు జీహెచ్‌ఎంసి నీటిపై ఆధారపడ్డ వారు నీరు లేక అలమటించాల్సి వస్తున్నదని పేర్కొంటున్నారు. అపరిశుభ్ర జలాలతో అనారోగ్యం కలుగుతోందని, చాలీ చాలని జీతాలతో ఆసుపత్రుల పాలైతే ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివేకానందనగర్ డివిజన్ రిక్షాపుల్లర్స్ కాలనీ ప్రధాన రహదారి, పీజేఆర్ విగ్రహం వద్ద తాగునీటి వాల్వ్ లీకేజీతో నీరు ఏరులై పారుతోంది. అలాగే జగద్గిరిగుట్ట ఇందిరాగాంధీ విగ్రహం నుంచి కూకట్‌పల్లికు వెళ్లే రహదారిలోని పీజేఆర్ ఫంక్షన్ హాలు సమీపంలో ప్రధాన రహదారిలో మంచినీటి వాల్వ్‌లు లీకై కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయి. ఇకఆల్విన్‌కాలనీ పైపులైన్ రోడ్డులోని బ్రిడ్జి పక్కన ఉన్న ప్రధాన పైపులైన్ లీకేజి అయి అందులో చెత్తా చెదారం చేరి మురుగు నీరు సరఫరా అవుతోంది. భాగ్యనగర్‌కాలనీలోని గోవిందు హోటల్ చౌరస్తాలోను కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయి. ఈ విధంగా పలు ప్రాంతాల్లో కలుషిత నీరు వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు శిధిలావస్థకు చేరిన పైపులైన్లు, వాల్వ్‌లు తొలగించి నూతన పైపులైన్లు, వాల్వ్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని సరఫరా చేయాలని స్థానిక సంక్షేమ సంఘాల సభ్యులు అధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు వినతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్పనగేష్ శనివారం హైదరాబాద్‌లో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని ఆమె కార్యాలయంలో కలిశారు. పూల మొక్కను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ సమస్యలపై జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. రాయ సముద్రం చెరువు, శ్రీనివాస్‌నగర్ కాలనీలోని ఫంక్షన్‌హాల్, కాకతీయనగర్‌లోని స్పోర్ట్ కాంప్లెక్స్, పాత రామచంద్రాపురంలోని మీట్ మార్కెట్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరగా ఆమె సానుకూలంగా స్పందించారని తెలిపారు.

నివాళి


శ్యామాప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన డివిజన్ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, బీజేపీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతోత్సవాల్లో భాగంగా శనివారం హైదర్‌నగర్ డివిజన్ పరిధిలో హెచ్‌ఎంటి శాతవాహననగర్‌లో డివిజన్ అధ్యక్షుడు నవీన్‌గౌడ్ ఆధ్వర్యంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర బీజేవైఎం మాజీ ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, అసెంబ్లీ ఓబీసీ కన్వీనర్ శేషయ్య, డివిజన్ ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, డివిజన్ నాయకులు కోటేశ్వరరావు, బాలాజీ, నర్సింగ్, కరుణాకర్, సైదమ్మ, కరుణాకర్, ప్రసాద్, మహేంద్రవర్మ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు


మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన జగదీశ్వర్ గౌడ్, వెంకటేష్ గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ని శనివారం శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, పోశెట్టి గౌడ్ తదితరులు ఉన్నారు.

సీపీఆర్‌పై మహిళలకు శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో సిటిజన్ హాస్పటల్ డాక్టర్ శ్రీధర్

హఫీజ్‌పేట్: చందానగర్‌లోని హుడా కాలనీ పార్కులో వాకర్స్, మహిళ సంఘాలు, కాలనీవాసులకు సీపీఆర్‌పై శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సిటిజన్ హాస్పటల్ ఎమర్జెన్సీ సర్వీసెస్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ మన శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవం గుండె అని అన్నారు. నేడు జీవనశైలి, ఆహారపు అలవాట్లు వలన ప్రస్తుతం వయస్సుతో సంబంధం లేకుండా గుండె సంబంధిత సమస్యలు ఎక్కువ అవుతున్నాయన్నారు. ప్రతి రోజు వ్యాయామం చేస్తూ ఆరోగ్యంగా ఉన్న యువతలో కూడా ఆకస్మిక గుండెపోటు రావడం ఇప్పుడు ఆందోళన కలిగిస్తున్న విషయమన్నారు. ఎవరికైనా గుండె నొప్పిగా అనిపించినా, ఊపిరి తీసుకోలేకపోవడం, పల్స్ అందనప్పుడు సీపీఆర్ చేయాలన్నారు. ధూమపానం, మద్యపానం, మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. నిత్యం వ్యాయమం, నడక, మెడిటేషన్ 40 నిమిషాల పాటు చేయాలన్నారు. ప్రతి రోజు తాజా ఆకుకూరలు, కూరగాయాలు, సీజనల్ ఫ్రూట్స్, నట్స్, డ్రైఫ్రూట్స్, మొలకలతో పాటు పీచు, క్యాల్షియం అధికంగా ఉన్న ఆహారాలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. కనీసం 6 గంటలు నిద్రపోవాలన్నారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ నాయకులు దశరథ రామయ్య, ప్రభాకరరావు, జగన్ యాదవ్, కాశేశ్వర్ రావు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ధర్మసాగర్, బాలరాజు, కుమారి, హాస్పటల్ ప్రతినిధి హరీష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు కిట్లు అందజేత

గచ్చిబౌలి: పులివెందులలో జగరనున్న సౌత్ జోన్ హాకీ టోర్నమెంట్‌లో తెలంగాణ జట్లు ఉత్తమ ప్రతిభ కనబర్చాలని రాష్ట్ర హాకీ అధ్యక్షుడు కొండా విజయ్ పేర్కొన్నారు. శనివారం గచ్చిబౌలి హాకీ స్టేడియంలో హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు కిట్, ట్రాక్ సూట్లను అందజేశారు. ఈ నెల 10 నుంచి 17 వరకు పులివెందులలో జరగనున్న టోర్నమెంట్‌కు తెలంగాణ బాలురు, బాలికల జట్లు ఎంపికయ్యాయని తెలిపారు. తెలంగాణ హాకీ సెక్రెటరీ భీమ్ సింగ్, హైదరాబాద్, రంగారెడ్డి సెక్రెటరీలు వేణు, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

నియామకం

మణికొండ: మణికొండకు చెందిన బి.శివకుమార్‌ను ఓబీసీ మోర్చ నియోజకవర్గ కన్వీనర్‌గా నియమించినట్టు జిల్లా అధ్యక్షుడు డి. లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రజల సమస్యలపై పోరాడాలని సూచించారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



మణికొండ: నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండాలని ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నంబర్ 13లోని శ్రీ సీతారామచంద్ర ఆలయం ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం నిర్వహించిన కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం సీతారామచంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు.

అలరించిన హరి సంకీర్తనలు



మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో ప్రత్యూష హరి సంకీర్తనలతో సందర్శకులను అలరించారు. గురువు ప్రత్యూషహరి శిష్య బృందంచే అంతయూ నీవే, శరణు శరణు, ముద్దుగారేయశోద, నవనీతచోర, చక్కనితల్లికి, కొలని దోపరికి, ఒకపరికొకపరి, పొడగంటిమయ్యా, హరినామము కీర్తనలను ఆలపించారు. శిష్యబృందం వమిక శ్రీపతి, కరుణాదేవి, సురభి అంజనదేవి, కంచర్ల శ్రీదేవి, శృతి మేఘన, రాధికరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సంస్థ అధ్యక్షులు డాక్టర్ శోభారాజు కళాకారులను జ్ఞాపికలతో సత్కరించారు.

ఘనంగా అంతర్జాతీయ సహకార దినోత్సవం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని తెల్లాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసం తమవంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్‌లు సునీల్, నాగిరెడ్డి, అనంతయ్య, యాదయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

శంషాబాద్: పట్టణంలోని హిందు వికాస్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్లో చదువుతున్న పేద విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులను అందజేశారు. పట్టణంలోని మినీస్టేడియం వద్ద ఉన్న ప్రభుత్వ పాఠశాలతో పాటు ఎల్‌బీఎం ప్రైవేటు పాఠశాలతో కలిపి మొత్తం 700 మంది విద్యార్థులకు అందజేసినట్లు ఉత్సవ సమితి అధ్యక్షుడు దేవిరెడ్డి రఘునాథ్‌రెడ్డి తెలిపారు.

సృజన జాతీయ నృత్యోత్సవాలు






మాదాపూర్: సృజన జాతీయ నృత్యోత్సవాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం అంజనాచౌదరి ఆధ్వర్యంలో నృత్యోత్సవాలను నిర్వహించారు. అందులో భాగంగా రమ్యతేజ కూచిపూడి నృత్యం, రవికుమార్ బృందం లంబాడా నృత్యం, రిత్విక్, వెంకట్, కుమారి చార్మిలా వెంకట్ సింహనందిని నృత్యం, డాక్టర్ మైథిలి అనూప్ మోహినీయట్టం, రాందాస్ బృందం పంజాబీ , శ్రీనివాసన్ యక్షగానం, డాక్టర్ శతాబ్ది ఆచార్య గౌడియా నృత్య ప్రదర్శనలు అలరించాయి. కళాకారులందరిని అంజనాచౌదరి ఘనంగా సత్కరించారు.

నిధులు కేటాయించాలని మంత్రికి వినతి


మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన ఎమ్మెల్యే గాంధీ, ఇతర ఎమ్మెల్యేలు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు విన్నవించినట్లు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. శనివారం బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మంత్రిని కలిశారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను ప్రాధాన్యతా క్రమంలో మరమ్మత్తులు చేపట్టాలని సూచించినట్లు చెప్పారు. పార్టీలకు అతీతంగా నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. చెరువులు, పార్కుల అభివృద్ధి, డ్రైనేజీ, సీసీ రోడ్ల వంటి మౌలిక వసతులు కల్పించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారని గాంధీ పేర్కొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ పోస్టర్ విడుదల


పోస్టర్‌ను ఆవిష్కరించిన రవికుమార్ యాదవ్

గచ్చిబౌలి: ఇంటర్నేషనల్ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్ పోటీల పోస్టర్‌ను బీజేపీ శేరిలింగంపల్లి ఇంచార్జీ ఎం.రవికుమార్ యాదవ్ ఆవిష్కరించారు. శనివారం మసీద్‌బండలోని పార్టీ కార్యాలయంలో మార్షల్ ఆర్ట్స్ పోస్టర్, ట్రోఫీని లాంచ్ చేశారు. డ్రాగన్ కుంఫ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆగస్టు 11న గచ్చిబౌలి స్టేడియంలో ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్ పోటీలు జరగనున్నాయని రవి కుమార్ తెలిపారు.

నేడు గురుపూజోత్సవం

మణికొండ: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ గోల్కొండ భాగ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10గంటలకు గురుపూజోత్సవం నిర్వహిస్తున్నట్టు భాగ్ సంచాలక్ గౌడ వేదప్రకాశ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వోటరీ టెక్ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు, సీతఓ కమటం సంజయ్, వక్తగా దక్షిణమధ్యక్షేత్ర ప్రచారక్ సుధీర్‌లు హాజరవుతున్నారని ఆయన వివరించారు.

జూనోసిస్ డే.. కుక్కలకు టీకాలు

పటాన్‌చెరు టౌన్: జూనోసిస్ డే సందర్భంగా 96 కుక్కలకు టీకాలు వేశామని పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. అలాగే పిచ్చి కుక్కల ద్వారా వచ్చే రేబిస్ వ్యాధి రాకుండా నివారించేందుకు ఉచితంగా టీకా కార్యక్రమం నిర్వహించామని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు మునీర్ అహ్మద్ అన్సారి తెలిపారు. పెంపుడు కుక్కల యజమానులందరూ టీకాలు వేయించాలన్నారు.

వీడ్కోలు, అభినందన సమావేశం


బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానించిన యువనేత రామకృష్ణగౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలోని ఎంపీపీఎస్, జెడ్పీహెచ్‌యస్ ప్రభుత్వ పాఠశాలల్లో బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు వీడ్కోలు, అభినందన సమావేశం శనివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శివరాజు గౌడ్, భాస్కర్, పాండుగౌడ్, షౌకత్‌అలీమున్నా, సయ్యద్, మహస్త్రష్, ఫారూఖ్, ఖలీమ్, కిరణ్మయి, సంధ్యారాణి, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల విక్రయ కేంద్రం ప్రారంభం

శంషాబాద్ రూరల్: రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు మల్కారం సొసైటీ చైర్మన్ బి.సతీష్ తెలిపారు. శనివారం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ విక్రయ కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు తగిన మోతాదులోనే పంటలకు ఎరువులు వాడాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఆయా పంటలకు వాడాల్సిన మోతాదులో ఎరువులు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరక్టరు కృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్లను వాడుకలోకి తీసుకురావాలి


కూకట్‌పల్లి నియోజకవర్గంలో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, అధికారులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ శనివారం కూకట్‌పల్లిలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. మలేషియన్ టౌన్‌షిప్ నుంచి షైటవర్ వరకు ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్లను వాడుకలోకి తీసుకువచ్చి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. రోడ్ల మధ్య ఉన్న చెట్లను ట్రాన్స్‌లొకేట్ చేయటానికి యుబీడీ అధికారులకు, రోడ్డు మధ్య ఉన్న ఎలక్ట్రికల్ పోల్స్‌ను షిఫ్ట్ చేయటానికి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎలక్ట్రికల్, అలాగే రోడ్డు మధ్య ఉన్న తాగునీటి వాల్వ్‌ను త్వరగా షిఫ్ట్ చేయాలని సూపరింటెండెంట్ ఇంజనీర్‌లను ఆదేశించారు. అనంతరం రమ్యాగ్రౌండ్ వద్ద జీవీపి పాయింట్‌ను పరిశీలించి చెత్తను తొలగించాలని అధికారులకు సూచించారు. 15 రోజుల్లో జీవీపీలను తొలగించాలని ఆదేశించారు. కూకట్‌పల్లి మెట్రో క్యాష్ అండ్ క్యారీ వెనుక వున్న ఇంటర్మీడియట్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను సందర్శించి సిమెంట్ ఫ్లోరింగ్ చేయాలని రాంకీ ఏజెన్సీ వారిని ఆదేశించారు. షిరిడి సాయినగర్, గాజుల రామారంలో ఉన్న పరికి చెరువును పరిశీలించారు. ఒక్షిత్ ఎన్‌క్లేవ్ వద్ద జరుగుతున్న బాక్స్ డ్రైన్ పనులను పరిశీలించారు. అనంతరం కాలనీవాసులతో చర్చించి, ఇంజనీరింగ్ అధికారులను పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. కాలనీవాసులకు డ్రైనేజీ కనెక్షన్, తాగునీటి కనెక్షన్‌లను పునరుద్ధరించాలని ఆదేశించారు. జగద్గిరిగుట్టలోని అతి పెద్ద ఇంటర్మీడియట్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ చిన్నారెడ్డి, డిప్యూటి కమిషనర్లు రమేష్, మోహన్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సత్యనారాయణ, కిష్టప్ప, సహాయ వైద్యాధికారులు సాల్మన్ రాజు, మమత, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ఎంటమాలజిస్టు సంధ్య, స్వప్న, ఏసీపీ మల్లేశ్వర్, రామ్‌కీ ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

8న మణికొండలో వనమహోత్సవం

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని అనంత పద్మనాభస్వామి దేవాలయం కొత్త రోడ్డులో సోమవారం వన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మొక్కలు నాటి ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ కౌన్సిలర్లు నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రహదారి పనులు పరిశీలన

శంషాబాద్: హెచ్‌ఎండీఏ నిధులతో సాతంరాయి నుంచి లంగర్‌గూడ వరకు కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను శనివారం పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ పరిశీలించారు. రహదారి పనులు నాణ్యతతో ఉండాలని ఆయన అధికారులకు సూచించారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పరిధిలోని ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఏక్ పేడ్ మాకె నామ్ కార్యక్రమంలో భాగంగా విశ్వవిద్యాలయం హెల్త్ సెంటర్ ఆవరణలో శనివారం వివిధ రకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీన్ ఆఫ్ స్టూడెంట్ ఆఫైర్స్ డాక్టర్ జెల్లా సత్యనారాయణ హాజరై విద్యార్థులకు పర్యావరణం, మొక్కల పెంపకం ఆవశ్యకత గురించి వివరించారు.

తహసీల్దార్‌కు వినతి

జిన్నారం(పటాన్‌చెరు): రాళ్లకత్వ గ్రామ శివారులో క్రషర్ మిషన్ ఏర్పాట్లను నిలిపివేయాలని గ్రామస్తులు రెవెన్యూ అధికారులను కోరారు. ఈ మేరకు శనివారం డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునస్వామిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు రాళ్లకత్వ గ్రామ పరిధిలో సర్వే నంబర్ 286 లోని అసైన్డ్ భూమిలో క్రషర్ మిషన్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయని తక్షణమే వీటిని నిలిపేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు.

మనీ లాండరింగ్ కేసు అంటూ సైబర్ మోసం

- ముంబైలో కేసు నమోదు అయిందని ఫోన్
- రూ.3 లక్షలు పోగొట్టుకున్న బాధితులు

పటాన్‌చెరు టౌన్: మనీ లాండరింగ్ కేసులో ముంబైలో మీపై కేసు నమోదు అయిందంటూ బెదిరించి సైబర్ మోసగాళ్లు 3 లక్షలు కాజేశారు.పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం...పటాన్‌చెరు మండలం లక్డారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి జూలై 1వ తేదీన మనీ లాండరింగ్ కేసులో మీ ఆధార్ ఫోన్ నెంబర్ ఉన్నాయని ముంబై చెంబూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసు పెండింగ్ ఉందని చెప్పి అపరిచిత వ్యక్తి బాధితున్ని భయపెట్టాడు. దీంతో బాధితులు అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా చేయడంతో అతని ఖాతా నుండి మూడు లక్షల నగదు డ్రా అయినట్టు మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి శనివారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.